క్లుప్తంగా

వ్యర్థాల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

జగదాంబ : జీవీఎంసీ 35వ వార్డులోని ఫ్రూట్ మార్కెట్, చేపల బజార్ పరిసరాల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొనడంపై 'సాక్షి'లో 'వ్యర్థం, అనర్థం' శీర్షికన గురువారం వెలువడిన కథనానికి జీవీఎంసీ అధికారులు తక్షణమే స్పందించి ఆయా ప్రాంతాల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించారు. అంతే కాకుండా అక్కడ దోమల లార్వాలు వృద్ధి చెందకుండా మలేరియా సిబ్బందితో యాంటీ లార్వా ఆపరేషన్ చేయించారు. దీంతో పరిశుభ్రత నెలకొనడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

27వ వార్డులో బీసీజీ టీకాలు



వైద్యురాలు శ్రావణి పర్యవేక్షణలో బీసీజీ టీకాలు వేస్తున్న సిబ్బంది

సీతమ్మధార : జీవీఎంసీ 27వ వార్డులోని ప్రైమరీ హెల్త్ సెంటర్ (యూపీహెచ్‌సీ)లో బీసీజీ టీకాలు వేశారు. వైద్యురాలు శ్రావణి పర్యవేక్షణలో ఏఎన్‌ఎంలు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రావణి మాట్లాడుతూ వర్షాల నేపథ్యంలో ప్రజలు జ్వరాల బారిన పడకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, దోమ తెరలు వాడాలని స్థానికులకు అవగాహన కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

అందర్నీ ఆకట్టుకునే 'విక్రమ్ కే దాస్'

దాబాగార్డెన్స్ : ప్రముఖ నిర్మాత కంచర్ల అచ్యుతరావు ఎస్ఎస్ఎల్ఎస్ క్రియేషన్స్ పతాకంపై నిర్మిస్తున్న 8వ చిత్రం 'విక్రమ్ కే దాస్' మ్యూజిక్ సిటింగ్స్ జరుగుతున్నాయి. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే రీతిన కథ, కథనంతో ఈ చిత్రం రూపొందుతున్నట్లు ఆయన తెలిపారు. దర్శకుడు బాలు పొలిచెర్ల, యూనిట్ ప్రత్యేక శ్రద్ధతో మ్యూజిక్ సిట్టింగ్స్ జరుగుతున్నట్లు తెలిపారు. సంగీత దర్శకుడు పృథ్వీ వీనుల విందైన సంగీతం అందిస్తున్నారని చెప్పారు. తమ సంస్థలో 8వ చిత్రంగా విక్రమ్ కే దాస్ చిత్రం రూపొందుతుందని, హీరో కంచర్ల ఉపేందర్ ఈ చిత్రంతో మాస్ ఇమేజ్ సంపాదించడం ఖాయమని ఆయన పేర్కొన్నారు.

నేటి నుంచి మరిడిమాంబ అమ్మవారి ఉత్సవాలు



మరిడిమాంబ అమ్మవారు

దాబాగార్డెన్స్ : జీవీఎంసీ 31వ వార్డు పరిధి కనకలవీధి, చాకలిపేట గ్రామదేవత మరిడిమాంబ ఉత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. తొలేళ్ల సంబరాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఉదయం 9 గంటలకు అమ్మవారి ఉత్సవ చాటింపు నిర్వహించనున్నారు. శనివారం ఉదయం 5 గంటల నుంచి అమ్మవారి పూజా కార్యక్రమాలు, సాయంత్రం 7 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు కమిటీ ప్రతినిధులు తెలిపారు. 28న అమ్మవారి ఉత్సవం సందర్భంగా ఉదయం 5 గంటల నుంచి అమ్మవారికి విశేష పూజలు, పంచామృతాభిషేకాలు, పసుపు కుంకుమలు అందజేయనున్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి కాళీమాతా డ్యాన్సులు, విజయనగరం పులివేషాలు, గరిడి సేవ, డోలక్కులు, డప్పు డ్యాన్సులు, మహిళా కోలాటం, తప్పెటగుళ్ల వంటి సాంస్కృతిక కార్యక్రమాలతో పెద్ద ఎత్తున అనుపు కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

ఆక్రమణలతో అవస్థలు



రహదారి మధ్యలో వాహనాల పార్కింగ్

ఎంతో చరిత్ర కలిగిన పూర్ణామార్కెట్ విశాఖ వాసుల మనసులో చెరగని ముద్ర వేసుకుంది. నగరంలోని ఎక్కడి వారైనా పెద్ద ఎత్తున సరకులు కావాల్సి వస్తే నేరుగా పూర్ణామార్కెట్‌కే వస్తారు. ఆకుకూరలు, కూరగాయలు, మషాలా దినుసులతో పాటు వంటకు కావాలిసన ఏ సామగ్రి అయినా ఇక్కడ తక్కువ ధరకు దొరుకుతుంది. అంతటి ప్రాముఖ్యత కలిగిన పూర్ణామార్కెట్ ప్రధాన రహదారికి సంబంధించి ట్రాఫిక్ జామ్ సమస్యతో సతమతమవుతోంది. ఇక్కడ రోడ్డుపై తట్టలు, జంగిడీలు పెట్టుకుని వ్యాపారాలు చేసేవారు, తోపుడు బళ్ల వారు, పండ్ల వ్యాపారులు నచ్చినట్లు ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తూ విక్రయాలు చేసుకుంటున్నారు. దీని వల్ల మార్కెట్‌కు వచ్చే వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకుంటే ఈ సమస్య ఉండదని అంతా అంటున్నారు.



పూర్ణామార్కెట్ ప్రధాన రహదారిపై వ్యాపారాలు

- పూర్ణామార్కెట్ బయటే అమ్మకాలు సాగిస్తున్న కూరగాయల వ్యాపారులు, తోపుడు బండ్ల విక్రేతలు
- రహదారి దిగ్బంధంతో రాకపోకలు సాగించలేక వినియోగదారుల అవస్థలు

జగదాంబ : పూర్ణామార్కెట్ ప్రధాన రహదారి ఆక్రమణల వల్ల రాకపోకలకు ఇబ్బందిగా ఉందని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ఎంతో ప్రాముఖ్యత కలిగిన పూర్ణామార్కెట్‌లోకి సాయంత్రం వేళ అడుగుపెట్టాలంటే భయపడాల్సి వస్తోందని చెబుతున్నారు. వందల సంఖ్యలో దుకాణాలు, వాటిలో పరిమితికి మించి జంగిడీలు రహదారికి అడ్డంగా పెట్టడంతో కనీసం నడవడానికి కూడా వీల్లేకుండా ఉంటుందంటున్నారు. ఈ విషయం అడగాల్సిన ట్రాఫిక్ పోలీసులు కనీసం స్పందించకపోవడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా ప్రధాన రహదారిని ఆక్రమించుకుని నచ్చినట్టు వ్యాపారాలు చేసుకుంటున్నారని పాదచారులు, వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులకు హెల్మెట్ కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల టార్గెట్ ఇవ్వడంతో వారు పూర్ణామార్కెట్ ప్రధాన రహదారి ఆక్రమణపై దృష్టి సారించలేకపోతున్నారు. ఇక్కడ రద్దీ వల్ల మార్కెట్‌కు వాహనాలపై వచ్చే వినియోగదారులు సజావుగా ప్రయాణించలేకపోతున్నాం అంటున్నారు. అలాగే తమ వాహనాలను పార్కింగ్ చేసుకోవడానికి కూడా వీలు కావడం లేదని చెబుతున్నారు. మార్కెట్ ముగించుకుని తిరిగి వెళ్లేందుకు కూడా చాలా సమయం పడుతుందంటున్నారు. దీనికి ముఖ్య కారణం ఇక్కడ ప్రధాన రహదారిపై ఇష్టం వచ్చినట్లు వ్యాపారాలు చేయడమే అని చెబుతున్నారు.



పండగల వేళ ఇదీ పరిస్థితి

రహదారిపైనే వ్యాపారాలు..

పూర్ణామార్కెట్ ప్రధాన రహదారిపై కాయగూరల దుకాణాలు, తోపుడుబండ్లు, పళ్ల బండ్లతో వ్యాపారాలు చేయటం వల్ల ఈ దుస్థితి నెలకొంటుందని పలువురు ఆరోపిస్తున్నారు. పండగల సమయంలో ఇక్కడ అడుగు పెట్టలేని దుస్థితి నెలకొంటుందని చెబుతున్నారు. దీంతో పాటు వ్యాపారుల సామగ్రి తీసుకొచ్చే ఆటోలు సామగ్రి దించే వరకు దారికి అడ్డంగా ఆపేస్తూ ఉండటం వల్ల కూడా ఇక్కడ తరచూ రద్దీ సమస్య ఏర్పడుతుందని పలువురు పేర్కొంటున్నారు.

పోలీసుల పర్యవేక్షణ తప్పనిసరి..

విపరీతమైన రద్దీ ఉండే పూర్ణామార్కెట్ ప్రధాన రహదారిపై ట్రాఫిక్ జామ్ ఏర్పడకుండా ఉండాలంటే ప్రతిరోజూ ట్రాఫిక్ పోలీసుల పర్యవేక్షణ ఉండాలని మార్కెట్‌కు వచ్చే వినియోగదారులు.. చుట్టుపక్కల ప్రాంతాల వారు చెబుతున్నారు. లేకపోతే మార్కెట్‌కు రావడానికి.. వెళ్లడానికి నానా అవస్థలు పడాల్సి వస్తుందని వాపోతున్నారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం



ప్రత్యేక అలంకరణలో కనకమహాలక్ష్మి అమ్మవారు

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో 32 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసుల రెడ్డి, ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐటీఐలో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ: స్టీల్‌సిటీ ప్రభుత్వ ఐటీఐలో మిగులు సీట్ల రెండో విడత భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఐటీఐ ప్రిన్సిపాల్ కె. శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 24లోగా iti.gov.in పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న కాపీ, ఒరిజినల్ సర్టిఫికెట్లతో వెరిఫికేషన్ చేయించుకున్న అభ్యర్థులు ఐటీఐలో ప్రవేశం కోసం ఈ నెల 27 ఉదయం 9.30 గంటల నుంచి నిర్వహించనున్న కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని పేర్కొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

దాబాగార్డెన్స్ : జీవీఎంసీ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన పి. సంపత్‌కుమార్‌ను గురువారం కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరాన్ని మరింత అభివృద్ధి చేయడానికి సహాయ సహకారాలు అందించాలని, పనుల నాణ్యతలో రాజీ పడకూడదని కాంట్రాక్టర్లకు తెలిపారు. కమిషనర్‌ను కలిసిన వారిలో అసోసియేషన్ చైర్మన్ రొంగలి జగన్నాథం, గౌరవ అధ్యక్షుడు వి. సత్యనారాయణ, అధ్యక్షుడు గొంప చంద్రమౌళి, కార్యదర్శి రంధి సాధూరావు, ఉపాధ్యక్షుడు పీఎస్ ప్రసాద్, పీఏ రాజు, బి. రామానాయుడు, సలహాదారులు పైలా కృష్ణారావు, నాగరాజు, ఆడిటర్ ఎస్. రవీంద్ర, జాయింట్ సెక్రటరీ పిల్లా సూరిబాబు, ఎంవీ సత్యనారాయణ, గణేష్, రాంబాబు, సభ్యులు సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

మహారాణిపేట : తమను వేధిస్తున్న యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ఉన్న సెంట్రల్ ఫార్మసీలో పని చేస్తున్న కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. తమ సర్టిఫికెట్లు, బాండ్లు తిరిగి ఇప్పించాలని కోరుతూ గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. సెంట్రల్ ఫార్మసీలో ఉద్యోగం కోసం జాబ్ మేళా ద్వారా మూడేళ్ల కాలపరిమితితో విధుల్లోకి తీసుకున్నారని, ఆరు నెలల పాటు శిక్షణ ఇచ్చి ఆ తర్వాత ఉద్యోగం ఇస్తామని చెప్పారన్నారు. విధుల్లో చేరే సమయంలో తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకున్నారని, అలాగే ఖాళీ బాండ్ పేపర్ల మీద సంతకాలు తీసుకుని ఉంచుకున్నారని తెలిపారు. వాటిపై ఏం రాశారో తమకు చూపించలేదని, విధుల్లో చేరిన నాటి నుంచి ఎన్నో రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని కార్మికులు వాపోయారు. 8 గంటల పని నిబంధన పాటించలేదని, తమ చేత 12 నుంచి 14 గంటలు పని చేయించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అదనపు పని గంటలకు ఓటీ ఇస్తామని చెప్పి ఇప్పుడు అమలు చేయడం లేదని, ఇతర సౌకర్యాలేవీ కల్పించలేదని తెలిపారు. యాజమాన్యంలోని ఒక వ్యక్తి లైంగిక దాడులకు పాల్పడుతున్నారని మహిళా కార్మికులు వాపోయారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

ప్రజలతో మర్యాదపూర్వకంగా మెలగాలి



పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో అధికారులు, సిబ్బందికి సూచనలిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

- పారదర్శకంగా సమస్యలు పరిష్కరించాలి
- పోలీసులకు సీపీ శంఖబ్రత బాగ్చి సూచన

పెందుర్తి: సమస్యల పరిష్కారం కోసం పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో సిబ్బంది మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సూచించారు. ఫిర్యాదు చేయడానికి వచ్చిన ఇరు పక్షాల వాదనలు విని.. తగిన విచారణ చేసి సమస్య పరిష్కరించాలన్నారు. గురువారం పెందుర్తి పోలీస్ స్టేషన్‌ను సీపీ ఆకస్మిక తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. ఖాళీ స్థలాల్లో వ్యర్థాలు వేయకుండా అక్కడ మొక్కలు నాటాలన్నారు. సిబ్బంది ఎవరు ఏ విధులు నిర్వర్తిస్తున్నారో ప్రజలకు తెలిసే విధంగా నేమ్ బోర్డులు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. స్టేషన్‌లో సిబ్బంది నిర్ణీత సమయానికి.. పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండాలని.. పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. రిజిస్టర్లు రోజువారీ అప్డేట్ ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. సిబ్బందికి ఏ సమస్యలు ఉన్నా చెప్పాలన్నారు. సిబ్బందికి కుటుంబ పరంగా, వృత్తి పరంగా ఏ సమస్య ఉన్నా 79950 95799 నంబర్‌కు తెలియజేయాలన్నారు. వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలు పాడవకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆ విభాగం అధికారులకు ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పట్టే విధంగా ఎప్పటికప్పుడు ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్ల కదలికలను నిశితంగా పరిశీలించాలన్నారు. గంజాయి రవాణాపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. అవసరమైన ప్రతి చోట సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి చేయాలని ఆదేశించారు. విధుల నిర్వహణలో ఎవరు బాధ్యతారహిత్యంగా వ్యవహరించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎస్‌ఐలు అసిరి తాత, నరసింహరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

జగన్నాథస్వామి ఆలయంలో మహాన్నదానం

దాబాగార్డెన్స్ : జగన్నాథస్వామి రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా గురువారం టౌన్ కొత్తరోడ్డులో వేంచేసిన బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథస్వామి ఆలయ ప్రాంగణంలో మహాన్నదాన కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ దక్షిణ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆలయ ఈవో టి. రాజగోపాల్‌రెడ్డి, అర్చకులు పాణంగిపల్లి జగన్నాథాచార్యులు, అనంతాచార్యులు, యేడిద సురేష్‌బాబు, భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పౌర గ్రంథాలయంలో చైనా చిత్రం ప్రదర్శన



మాట్లాడుతున్న నరవ ప్రకాశరావు

సీతంపేట: వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో 'ది పోస్ట్ మ్యాన్ ఇన్ ద మౌంటెయిన్' అనే చైనా సినిమాను ఇంగ్లిష్ సబ్ టైటిల్స్‌తో ప్రదర్శించారు. ఈ సందర్భంగా సంస్థ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ భారతదేశం తర్వాత చైనాకు స్వాతంత్య్రం వచ్చినా, అభివృద్ధిలో ప్రపంచ దేశాలతో పోటీ పడుతోందన్నారు. సినిమా పరిశ్రమలో కూడా మంచి అభివృద్ధి సాధించిందన్నారు. ది పోస్ట్ మ్యాన్ సినిమాలో మానవ సంబంధాలు, జీవన విధానంతో పాటు పర్వత ప్రాంతాల్లో చైనా ప్రజల జీవితం కనిపిస్తుందన్నారు. కార్యక్రమంలో ఉషారాణి, ఎస్.విజయకుమార్, బి.చిన్నారావు, హుస్సేన్, చాట్ల బాబురెడ్డి, బాబ్జి పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం



కంచరపాలెం రైతుబజారు వద్ద నిరసనలో మాట్లాడుతున్న బొట్టా ఈశ్వరమ్మ

కంచరపాలెం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ సీపీఎం కంచరపాలెం జోన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఆందోళన చేపట్టారు. కంచరపాలెం బీఎన్ఆర్ భవన్ నుంచి దేవేంద్రనగర్, రెడ్డి కంచరపాలెం, దుర్గానగర్, జాషువానగర్ ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించి కంచరపాలెం రైతుబజారు వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా జోన్ కార్యదర్శి, మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ఆర్థిక సహకారం అందిస్తారని కార్మికులు వేయి కళ్లతో ఎదురు చూస్తే.. ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతి అభివృద్ధికి రూ.15,000 కోట్లు కేటాయించడం అబద్ధమని, అప్పు తెచ్చుకోవడానికి హామీగా ఉంటామని మాత్రమే చెప్పారన్నారు. ప్రభుత్వం, పచ్చ మీడియా వాస్తవాలు చెప్పకుండా ప్రజలను పక్కదారి పట్టిస్తున్నాయని ఆరోపించారు. ఈ బడ్జెట్‌ను సీపీఎం తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. పార్టీ జోన్ నాయకులు ఒమ్మి అప్పారావు, ఎం.ఈశ్వరరావు, బి.ఎస్.చలం, బి.అప్పారావు, శంకరరావు, కుమారి తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు'ను ప్రభుత్వరంగ సంస్థగా కొనసాగించాల్సిందే..

అగనంపూడి: విశాఖ ఉక్కు ప్రజల సొత్తని, దానిపై రాష్ట్ర ప్రజలకు పూర్తి హక్కు ఉందని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ అన్నారు. కాదని, మొండిగా ముందుకు వెళ్లి ప్రైవేటీకరణ చేయాలని చూస్తే ఉపేక్షించేది లేదన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ యత్నాలకు నిరసనగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే దీక్షల్లో 1260వ రోజు ఆయన మాట్లాడారు. మూడోసారి అత్తెసరు మెజార్టీతో అధికారంలోకి వచ్చినా మోదీ, అమిత్‌షా ఆలోచనా ధోరణిని మార్చుకోలేదని మండిపడ్డారు. లక్షల కోట్ల విలువైన ప్రజాధనాన్ని లూటీ చేసి ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టాలనుకుంటున్న కేంద్ర ప్రభుత్వం అదే ధోరణితో ముందుకువెళ్తే ప్రజల చీత్కారాలు తప్పవన్నారు. ఉక్కును సెయిల్‌లో విలీనం చేయడం తప్ప మరేదీ సరి కాదన్నారు. కార్యక్రమంలో కసిరెడ్డి సత్యనారాయణ, వరసాల శ్రీనివాసరావు, దాసరి శ్రీనివాస్, కె.శ్రీనివాసులు నాయుడు, ఏఐటీయూసీ నాయకులు కిడిమి రాజబాబు, ఎ.మసేనురావు, డొక్కా నరసింగరావు, నరేష్‌కుమార్, జి.జయ, తాండ్ర కనకరాజు, డి.దేముడు, గుమ్మడి నరేంద్రకుమార్, శివరామకృష్ణ, మురళీకృష్ణ, జ్యోతి ప్రసాద్, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు నిత్యావసరాల పంపిణీ



పారిశుధ్య కార్మికులకు దుస్తులు, నిత్యావసరాలు అందజేస్తున్న నాగమల్లేశ్వరి

దాబాగార్డెన్స్ : సమాజ సేవలో భాగంగా ఎంతో మంది పేదలకు సేవలందించిన మాల మహానాడు రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు డాక్టర్ మంచా నాగమల్లేశ్వరిని గురువారం సంఘ సభ్యులు, అభిమానులు, మహిళలు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా తన జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని నాగమల్లేశ్వరి జీవీఎంసీ పారిశుధ్య కార్మికులకు వస్త్రాలు, నిత్యావసర సరకులు అందజేశారు. ప్రతి ఏటా జన్మదినోత్సవం రోజున పేదలకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దళిత సోదరుల మధ్య తన జన్మదినోత్సవం జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. దళిత మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు రఘు మాట్లాడుతూ దళితులు ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారానికి నాగమల్లేశ్వరి ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మతోటి పాల్, న్యూహోప్ ఫౌండేషన్ సభ్యులు, దళిత సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వార్డులన్నీ పరిశుభ్రంగా కనిపించాలి



టౌన్ కొత్తరోడ్డు వద్ద చెత్త వేసే ప్రాంతాలను పరిశీలిస్తున్న ఏఎంహెచ్‌వో రాజేష్



బౌడారా రోడ్డులోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద శుభ్రం చేయిస్తున్న ఏఎంహెచ్‌వో

జగదాంబ : వార్డులన్నీ ఎక్కడా చెత్త లేకుండా పరిశుభ్రంగా ఉండాలని జీవీఎంసీ జోన్-4 ఏఎంహెచ్‌వో రాజేష్ అన్నారు. గురువారం ఆయన జీవీఎంసీ 35వ వార్డులో పర్యటించి చెత్త వేస్తున్న ప్రాంతాలను పరిశీలించారు. బౌడారా రోడ్డులో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చెత్త వేస్తున్న కారణంగా అక్కడ అపరిశుభ్రంగా ఉండటంతో వెంటనే పారిశుధ్య సిబ్బందితో శుభ్రం చేయించారు. అదే విధంగా టౌన్ కొత్త రోడ్డులోని జీఎస్ఎన్ శాస్త్రి రోడ్డులోని టింబర్ డిపోలున్న ప్రాంతాన్ని పరిశీలించి రహదారిపై ఉన్న దుంగలు తీసేసి పారిశుధ్యానికి సహకరించాలని వ్యాపారులను కోరారు. లేని పక్షంలో అపరాధ రుసుము విధిస్తామని హెచ్చరించారు. ప్రతిరోజు సిబ్బంది పర్యవేక్షించి పారిశుధ్యంపై రిపోర్టు ఇవ్వాలన్నారు. అనంతరం జనతా బజార్, మున్సిపల్ స్టేడియం, వెలంపేట పోస్టాఫీసు ప్రాంతాల్లో పర్యటించారు. వర్షాల నేపథ్యంలో రహదారులు, కాలువలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. మురుగు నీరు బయట ప్రవహించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మురుగు తొలగింపునకు జేసీబీలను ఉపయోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ కిశోర్, ఇన్‌స్పెక్టర్ సింగూరు సత్యనారాయణ, సెక్రటరీలు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సాంస్కృతిక కార్యక్రమాలు

- వివిధ ప్రదర్శనలతో అలరించిన విద్యార్థులు

సీతంపేట: శిక్షా సప్తాహ్ డే-4లో భాగంగా గురువారం అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పద్య పఠనం, దేశభక్తి గీతాలాపన, భరతనాట్యంతో అలరించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు టీడీపీ 26వ వార్డు అధ్యక్షుడు ముక్కా కిషోర్ చేతుల మీదుగా నోట్ పుస్తకాలు, పెన్నులు బహుమతులుగా అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మీనరస, ఉపాధ్యాయులు ఎం.వి.ధర్మారావు, ఎం.ఎస్.వి.విశ్వనాథం, నిర్మల, పద్మలత, మాణిక్యం పాల్గొన్నారు.

ఆకట్టుకున్న స్కిట్లు

కంచరపాలెం: జీవీఎంసీ 54వ వార్డు ఐటీఐ జంక్షన్ కప్పరాడ ఉన్నత పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. థింసా నృత్యం, 'డ్రగ్స్-అపరిచిత వ్యక్తులు' అనే స్కిట్లను విద్యార్థులు ప్రదర్శించి అలరించారు. ఉపాధ్యాయులు జ్యోతి, కుసుమకుమారి, యు.కల్యాణి తదితరులు సాంస్కృతిక కార్యక్రమాలను పర్యవేక్షించారు.



కప్పరాడ హైస్కూల్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు